# మనిషి - పగ

ఫైర్‌మన్ గంగరాజు మనసంతా చీకాకుగా ఉంది. డ్యూటీకి రాగానే, డ్రిల్ సమయంలో పరధ్యానంగా ఉన్నందుకు ఆఫీసరు చేత రెండుమాట్లు చివాట్లు తినటంవల్ల --- మరింత బాధగా ఉంది.

అసంలితకూ కారణం -- ఎదురింటి వీరాస్వామితో ఉదయం మళ్ళీ పెద్ద దెబ్బలాట జరగడమే.

గంగరాజు పెద్దకొడుకు రాము పదేళ్ళవాడు. ఎదురింటి వీరాస్వామి కొడుకుతో స్నేహం. ఈ మధ్య-- రాము వాళ్ళింటికి ఆడుకోవడానికి వెళ్ళినప్పుడల్లా ఏవో వస్తువులు మాయం కావడం మొదలెట్టాయి. నెమ్మదిగా ఆ దొంగతనాలన్నీ రాము మీద రుద్దసాగారు-- వీరాస్వామీ వాళ్ళూనూ. నాలుగైదు మార్లు చిన్న చిన్న సంఘర్షణలు జరిగాయి. గంగ రాజుకి కొడుకు మీద చాలా నమ్మకం. తరతరాలుగా వాళ్ళ వంశంలో దొంగతనమనేది ఎరగరు. అటువంటిది--రాముడికా బుద్ధి వచ్చిందంటే, గంగరాజుకి నమ్మకం కుదరలేదు. అయినా కొడుకుని గట్టిగా మందలించాడు--వీరాస్వామి యింటికి ఆటలకు వెళ్ళవద్దని.

చిన్నపిల్లలకి పెద్దవాళ్ళ పట్టింపులు అవీ యేం తెలుస్తాయి కనక? క్రితం రోజు సాయంత్రం వీరాస్వామి కొడుకు గుళ్ళ బోర్డు ఆడటానికి పిలిచాడు. రాముకి ఆ ఆటంటే సరదా. ఎవరికీ తెలియకుండా వెళ్ళి వచ్చేశాడు. చీకటిపడే సమయానికి వీరాస్వామి యింట్లో రిష్టువాచీ పోయిందని పెద్ద గోల బయలు దేరింది.

వీరాస్వామి భార్య వాళ్ళింటి అరుగు మీద నుంచి రాముని తిడుతూ గట్టిగా కేకలు మొదలు పెట్టింది. గంగరాజు భార్య కూడా గట్టిగా తిరుగు శాపనార్థాలు పెట్టేసరికి-- వీరాస్వామి పెళ్ళాం అరుగు దిగింది. గంగరాజు పెళ్ళాం కూడా అదే చేసింది. జుట్లు పట్టుకున్నారు. పేటంతా అక్కడేకమైంది. కొంత కాలక్షేపం జరిగిన తర్వాత, జనం వాళ్ళని విడదీసి లోపలికి పంపించారు.

డ్యూటీ అయిన తర్వాత రాత్రి పదింటికి యింటికి తిరిగివచ్చిన గంగరాజుకి, పెళ్ళాం జరిగిన గొడవంతా చెప్పింది. రాముని పట్టుకొని చితక బాదేశాడు నిజం చెప్పమంటూ. "నాన్నా! నాకేమీ తెలియద"న్నమాట స్పృహ తప్పేవరకూ రాము చెప్తూనే ఉన్నాడు. తీరా స్పృహ తప్పిన తర్వాత గంగరాజు కొడుకుని కౌగిలించుకుని బావురుమంటూ ఏడ్చాడు. గంగరాజు పెళ్ళాం నెత్తీ నోరూ బాదుకుంది. చుట్టుప్రక్కలవాళ్ళాయింట్లో జరుగుతున్న గొడవ వింటూనే ఉన్నారు. డాక్టర్ని పిలుచుకొచ్చి మందిప్పించిన తర్వాత-- అర్ధ రాత్రికి రాము ఈ లోకంలో పడ్డాడు.

ఉదయమే వీరాస్వామి వాళ్ళింటి అరుగు మీదనించి మళ్ళీ పాట మొదలెట్టాడు. గంగరాజు మాటకి మాట సమాధానం చెప్పడంతో --మళ్ళీ యిద్దరూ అరుగులు దిగి తన్నుకొనే పరిస్థితి వచ్చింది. వ్యవహారం ముదరకుండానే ఇరుగు పొరుగువాళ్ళు ఇదర్నీ

సర్దిచెప్పి లోపలికి పంపిచేశారు.

రెండింటికి షిఫ్టు డ్యూటీకి వెళ్ళగానే, డ్రిల్! యింట్లో జరిగిన గొడవల మూలంగా--పరధ్యానం ముంచుకొచ్చింది. ఫలితంగా చీవాట్లు తిన్నాడు. గంగరాజుకి మనసు చీకాకుగా ఉందంటే, ఉండదూమరి?

ఫైరాఫీసులో. నేరేడు చెట్టు కింద సిమ్మెంటు బెంచీ మీద కూర్చున్నాడు గంగరాజు. తోటి రామారావుతో జరిగినదంతా చెప్పుకుని ఏడ్చాడు. కొంతభారం తీరింది. రామారావు ఓదార్పుగా గంగరాజుకో బీడి యిచ్చి తనూ ఒకటి వెలిగించాడు. గంగరాజుకి సంతోషం కలిగించాలని జ్యోతిలక్ష్మి డాన్సు గురించి ఉపన్యాసం మొదలెట్టాడు. మాటలు కోటలుగా పెరిగే సమయానికి, దేశంలో ఉన్న నాట్యతారలందరూ కట్టుబడి పోయారు. తిరిగి ప్రస్తావన మొదటికొచ్చేసరికి ఫైర్ అలారమ్ మ్రోగింది.

మంగళవారప్పేటలో రామకోవెల దగ్గర కొంపలంటుకున్నాయి. గంగరాజు గుండెల్లో రాయిపడింది-- ఎందుకంటే అతని యిల్లూ అక్కడే. ఫైరాఫీసు గగ్గోలెత్తింది. మూడు నిముషాల్లో నాలుగు ఫైరింజన్లు మంగళవారప్పేట పరుగెత్తాయి.

ఉక్కిరి బిక్కిరిచేసే పొగ--అకాశాన్నంటుతూ మంటలు. ప్రజల హాహాకారాలతో ఏడ్పులతో నానా భీభత్సంగానూ ఉంది. ఫైరింజన్లు వెర్తూనే రంగంలోకి దూకాయి. చాలా మట్టుకు తాటాకు యిళ్ళు. అప్పటికే పాతిక కొంపలంటుకొన్నాయి. గాలి తీవ్రత వల్ల - ఓ పక్కనించి ఆర్పుతోంటే మరో పక్కనించి యిళ్ళంటుకొంటున్నాయి.

గంగరాజు నవనాడులూ క్రుంగిపోయాయి. గంగరాజిల్లుకూడా కాలిపోతోంది. ఎదురుగుండా వీరాస్వామిది, మరో నలుగురైదుగురివి పెంకుటిళ్ళు తప్ప వాటి చుట్టూ ఉన్న తాటాకు యిళ్ళన్నీ మండిపోతున్నాయి. వీరాస్వామి యింటికి ఉత్తరాన మండుతున్న గంగరాజు వాళ్ళ యిళ్ళు దక్షిణం వైపు నుంచి వీస్తున్న గాలివల్ల పక్కనున్న మైదానంలోకి మంటల్ని విసురుతున్నాయి. దక్షిణంవైపు అంటుకున్న యిళ్ళు మంటల్ని వీరాస్వామి వాళ్ళ యిళ్ళ మీదకు విసురుతున్నాయి.

గంగరాజిల్లు అప్పటికే సగం కాలిపోయింది. ఉత్తరం వైపునున్న యిళ్ళని ఆర్పుతోంది గంగరాజు గ్రూపు. గంగరాజు తన యింటి మీద దృష్టి కేంద్రీకరించాడు.

దక్షిణం నుంచి వీస్తున్న గాలివల్ల, అటుపక్క మండుతున్న యిళ్ళ మంటలు వీరాస్వామి యింటి మీద కెగబడుతున్నాయి. వీరాస్వామి యిల్లు ఏ క్షణంలోనైనా అంటుకొనే ప్రమాదం ఏర్పడింది. గంగరాజుకి పరిస్థితి అవగాహన అయింది. 'వీరాస్వామికి అవవలసిందే' అనుకొన్నాడు గంగరాజు కసిగా.

'నీ యిల్లు కాలిందని వీరాస్వామి యిల్లుకూడా భస్మమవాలని చూస్తున్నావు కదూ: నీ విధి ఏమిటి? అంటుకోని యిళ్ళను రక్షిస్తూ, మండుతున్న యిళ్ళని ఆర్పాలి : కాదంటావా?' - గంగరాజు అంతరంగంలో ఓ చిన్న మూలుగు. గంగరాజు ఒక్కక్షణం తటపటాయించాడు.

'వీరాస్వామి వరస యిళ్ళు అంటుకొంటే, అది మీ అసమర్ధతని తెలియచేస్తుంది.

విధి నిర్వహణలో నువ్వు కాలు జారినట్లవుతుంది' - విధి ఈ సారి మూలుగు గట్టిగా వినవచ్చింది.

గంగరాజులోని మనిషి మేల్కొన్నాడు. వెంటనే గట్టిగా అరిచాడు - "ముందర అటువైపు యిళ్ళని ఆర్పక పోతే, ఈ మధ్య యిళ్ళన్నీ అంటుకుపోతాయి. అటు పదండి!"

"ఒరేయ్! నీ యిల్లు కాలిపోతోంది కదట్రా!?" రామారావు అరిచాడు.

"మిగిలిందెలాగూ లేదూ. మనం వీటి కోసం పాటుపడి ప్రయోజనం లేకపోగా, మధ్యవరసలోని యిళ్ళంటుకొంటాయి, అటు పదండి."

గంగరాజు గ్రూపు వీరాస్వామి యింటికి దక్షిణం వైపు నున్న యిళ్ళని ఆర్పడం మొదలుపెట్టింది. ఇంట్లోంచి సామాన్లు బయటకు చేర వేస్తున్న వీరాస్వామి కళ్లు చెమ్మగిల్లాయి.

మూడు గంటలు కుస్తీ పట్టి, ఏడింటికల్లా మంటలనార్పి ఫైరాఫీసు చేరుకొన్నారు.

"సార్. నా యిల్లు కూడా కాలిపోయింది. పెళ్ళాం బిడ్డలు రోడ్డుమీదన్నారు. మీరనుమతి యిస్తే ముందుగా వెడ్తాను" గంగరాజు ఆఫీసర్ని అడిగాడు.

"గంగరాజూ! నిస్వార్థమైన బుద్ధితో విధి నిర్వహణలో నీ పగవాడిక్కూడా మేలుచేసిన విషయం రామారావు ద్వారా తెలిసింది. జీపు తీసుకొని వెళ్ళు. మళ్ళా నీ యిల్లు చక్కబడేవరకూ, నువ్విక్కడ స్టేషనులో ఉండడానికి నాకేమి అభ్యంతరం లేదు" ఆఫీసరు గంగరాజుని ఓ సారి భుజం తట్టి యింటికి పంపాడు.

మంటలారిన తర్వాత, సామాన్లు యింట్లోకి చేరవేస్తున్నప్పుడు వీరాస్వామి విధవ అప్పగారి పెట్టి జారిపడి, మూత విడి లోపలి వస్తువులన్నీ చెల్లాచెదురుగా పడ్డాయి. వాటిలో వాళ్ళింట్లో పోయిన వస్తువులు కూడా ఉన్నాయి! వీరాస్వామి, వీరాస్వామి పెళ్ళాం-- గంగరాజు కొడుకు మీద అభాండాలు వేసినందుకు సిగ్గుపడి పోయారు. వీరాస్వామి వీధిన పడ్డ గంగరాజు కుటుంబాన్ని బ్రతిమాలి తన యింట్లోని ముందర గదిలోకి తీసుకొచ్చాడు.

తిరిగివచ్చిన గంగరాజుకి జరిగిన సంగతి తెలిసింది. గంగరాజులోని పౌరుషం తలెత్తింది. నిద్రపోయిన పగ రగుల్కొంది. వెర్రిగా కేకలేసుకొంటూ వీరాస్వామి యింట్లోకి చొరబడ్డాడు. "సిగ్గులేకపోతేసరి! వాళ్ళకి బుద్ధి లేక ఉండమంటే నీ బుద్ధి ఏమైంది? పద పద!" పెళ్ళాం మీద విరుచుకుపడ్డాడు.

అడ్డమొచ్చి బ్రతిమాలుకోపోయిన వీరాస్వామినో తోపు తోశాడు గంగరాజు.

జీపులో సంసారాన్నెక్కించుకొని, ఫైరుస్టేషను పంచకు చేరబోతున్న గంగరాజుని- - నుదురు చిట్లి రక్తం కారుతున్న వీరాస్వామి తెల్లబోతూ అర్థం కానట్లుగా చూడసాగాడు.

●

('ఆంధ్రజ్యోతి' సచిత్ర వార పత్రిక : 11-6-1971)